కథ

# జ్ఞాపకం చిగురేసింది!

-శారద

జీవితం అనే యుద్ధ భూమిలో చిరునవ్వు ఖడ్గాన్ని ధరించి నిరంతరం పోరాటం సాగించే సైనికుణ్ణి మీరెప్పుడయినా చూశారా?

పోనీ నదీ తీరాన గంభీరంగా నిలచి ఉన్న ఆలయ శిఖరాన్ని ఎప్పుడయినా గమనించారా?

కనీసం గుప్పెడు నమ్మకాన్ని, కొండంత ధైర్యాన్ని అందించే అమృత హస్తం సంగతయినా మీకు తెలుసా?

ఎలా తెలుస్తుంది లెండి. మీరు మీ అమ్మను చూడలేదుగా.

అరె మా అమ్మ సంగతి మీకు చెప్పేశానే. ఇందాక చెప్పానే సరిగ్గా అలాగే ఉంటుంది అమ్మ. ఇవ్వడమే తప్ప ఇతరుల నుంచి ఏమీ ఆశించడం తెలియదమ్మకు.

బహుశ అమ్మదనంలోని గొప్పదనమే అదేమో!

అలాటి మా అమ్మ అలిగింది. ఈ సంగతి నాకెంతో ఆశ్చర్యాన్ని, అపనమ్మకాన్ని కలుగజేసింది.

అమ్మ అలకను తీర్చడానికి ఇప్పుడు వాళ్ళమ్మలేదు. వాళ్ళ నాన్న సరే కనీసం మా నాన్నయినా లేడు.

మిగిలింది మేమిద్దరం. అందులో అన్నయ్య ఉన్నా లేనట్టే. ఇక ఉన్నది నేను.

అమ్మ మనసు తెలుసుకోవాలన్నా, అమ్మ అలకను తీర్చాలన్నా నేనేకదా!

ఎందరివో అలకల్ని అమ్మ తీర్చగా నేను చూశాను. కానీ అమ్మ అలగడం నాకు తెలిసి ఇదే మొదలు. ఇంతకీ అమ్మ ఎందుకు అలిగిందో చెప్పాలంటే దానికి ముందు కొంత నేపథ్య కథనం చెప్పాలి మీకు.

అమ్మకు చెరో కన్నయి భవిష్యత్తువైపు నడిపే ఊతను, ఊపును ఇచ్చిన ఇద్దరు కొడుకుల్లో పెద్దవాడు అంటే నాకు అన్నయ్య, దేశం కాని దేశంలో పెద్ద ఉద్యోగగ్రస్తుడై, ఆపై ముక్కుముఖం తెలియని అమ్మాయిపై మోహం పెంచుకుని గృహస్థుడై దాదాపుగా ఉన్నా లేనట్టే ఉన్నాడు.

ఎదిగొచ్చిన కొడుకుల మురిపాలు చూడకుండానే నాన్న గుండెపోటుతో మరణిస్తే శ్వాసనా సైతం కోల్పోయి బతుకుతున్న అమ్మను సంతోష పెట్టడం నా ప్రథమ కర్తవ్యంగా భావించి అమ్మకు నచ్చే విధంగా అమ్మ మేనకోడలు సీతను పెళ్ళాడి, ఉన్న ఊర్లోనే వచ్చిన ఉద్యోగంతో సరిపెట్టుకుని అమ్మ మనసు ఏ మాత్రం నొచ్చుకోకుండా చూసుకుంటున్నాననే అనుకుంటూ వచ్చానిన్నాళ్ళు.

అన్నట్టు ఇటీవలే పాతకాలం నాటి మా ఇల్లు సత్తువ కోల్పోయి పెచ్చులు రాలడం ప్రారంభించడంతో కొన్ని మార్పులు చేసి ఇల్లు బాగుచేయించాలన్న నిర్ణయానికి వచ్చాం. ఏఏ మార్పులు చేయాలో ఎక్కడ గదులు ముందుకు పెంచాలో, డబ్బు ఎలా సర్దుబాటు చేయాలో అన్నీ అమ్మ దగ్గరుండి నా చేత లెక్కలు వేయించి సలహాలు చెప్పింది. ఉన్న డబ్బు బొటాబొటిగా సరిపోతుంది. పని పెట్టుకున్నాక పదో పరకో ఎక్కువే అవుతుంది కానీ తక్కువ కాదుకదా అని మథన పడుతుంటే మెల్లగా వెన్ను తట్టి 'అలా అధైర్యపడకు నాన్నా నువ్వు చేస్తోంది అవసరమైన పనే కదా! అంతగా అవసరమొస్తే ఏనగోనట్రో అమ్మేద్దాంలే. నీ పని నువ్వు చూసుకో' అంది.

అమ్మ తీరే అంత.

గోరంత మాటతో కొండంత బలాన్నిస్తుంది. అమ్మ నాకు అమ్మేకాదు. ఎన్నోసార్లు నాకు స్నేహితురాలు కూడా.

మరో మూడు రోజులయ్యేసరికి పనివాళ్ళొచ్చేశారు. ఇస్త్రీ పంచెకట్టుతో మేస్త్రీ హాజరయ్యాడు.

ఎక్కడ ఏఏ పని చెయ్యాలో ఆర్డర్లిచ్చేవాడు. అవసరమైన ఇటుక, సున్నం, కంకర అన్నీ వచ్చేశాయి. పనివాళ్ళు పని ప్రారంభించారు.

రీమోడలింగ్ పేరున ఉన్న గోడల్ని పగులగొట్టడం రవంత బాధా కలిగించినా మనసుకు సర్దిచెప్పుకున్నా. లీవ్ అప్పుడే ఎందుకు? అమ్మ చూసుకుంటుందిలే. మరీ అవసరమైతే ఎలాగూ తప్పదు. అనుకున్నా అమ్మ మీది భరోసాతో.

అలాంటి అమ్మ ఈవేళ చురుగ్గా అన్ని విషయాల్లో పాలుపంచుకోలేదు.

స్ట్రాంగైన కాఫీతో నన్ను పలకరించలేదు.

అమ్మ గొంతునుండి నవరత్న మాలిక వినిపించలేదు. నానిగాడ్ని నిద్ర లేవమని అదిలించలేదు.

'ఇంటి పనికాదు. అబ్బాయి సంగతి చూడు' అని కోడలికి పురమాయించలేదు.

అసలు నేచేసిన అపరాధమేమిటబ్బా!

అదే అడిగా అమ్మను.

"నాకు నచ్చలేదురా" అంది అమ్మ.

నేను తెల్లబోయాను, "ఏవిటమ్మా నీకు నచ్చనిది ఈ పని మొదలుపెట్టడమా? నీతో సంప్రదించే కదమ్మా"

మధ్యలోనే ఆపేసింది అమ్మ 'అది కాదురా'

'నచ్చనిది అదిగో ఆ పని' అంటూ చేయి చాచి చూపుతూ అంది.

అక్కడ కూలీలు ముందు వరండాలో ఉన్న ఎడం చేతి వేపు కిటికీని కొట్టి తీసెయ్యడానికి సన్నద్ధమవుతున్నారు.

ఎలాగూ ఇంతపని చేయిస్తున్నారుకదా. ఉన్న గోడను పగలకొట్టి ముందు గదిని ప్రహరీ గోడ వరకు పెంచితే ముందుగది విశాలంగా ఉంటుంది. ఎవరైనా వచ్చినా కూర్చుండుకు వీలుగా ఉంటుంది, అనినిన్న రాత్రి సీత కోరిన కోరిక మేరకు నేను అదనంగా తీసుకున్న నిర్ణయం అది. పని హడావుడిలో ఉదయం అమ్మకు చెప్పడం కుదరలేదు. అది నా తప్పే.

"ఏవిటీ కిటికీ అక్కడ నుంచి తీసెయొద్దా" అడిగాను. అవునన్నట్టుగా తల ఊపిందమ్మ.

నా చేతిని తన చేతిలోకి తీసుకుని మెల్లగా కిటికీ దగ్గరకు తీసుకువెళ్ళింది.

నేను కొత్తగా చూస్తున్నట్టు అమ్మ పక్క నిలబడి కిటికీలోంచి బయటకు చూడసాగేను.

కిటికీలోంచి ఉదయపుటెండ చురుక్కుమని పలకరించింది.

దక్షిణం వైపుగా ఉండ డంతో ఎండతోపాటు మలయానిలం కూడా మెత్తగా శరీరాన్నల్లుకుంది.

కిటికీలోంచి ఎదురిం టి ప్రహరీగోడ మీదుగా వాళ్ళ వాకిట్లో విరగబూసిన నంది వర్ధనం ప్రక్కనే దానికంటే ఎత్తులో ఎర్రగా నవ్వు తున్న పూలతో మందార చెట్టు, ప్రహరీ గోడను దాటి దాదాపు మా గుమ్మం వరకు అల్లుకున్న పారిజాతం కనిపిస్తున్నాయి.

పారిజాత పరిమళం, ఏనాటిదో జ్ఞాపకాలను కదిపి కుదిపేస్తోంది. పరిమళాలకు పలకరింపు లెక్కువాయె.

కొంచెం తల తిప్పితే మెయిన్ రోడ్డును, మా ఇంటినీ కలుపుతున్న వీధి కొస దాకా కనిపిస్తోంది.

వీధి మలుపున వేణుగోపాలస్వామి వారి ఆలయానికి ముందున్న ధ్వజ స్థంభం.

దాని మీద వందలాది పావురాలు సుమేఘ శకలంలా ఉన్నాయి.

కళ్ళనోసారి వాల్చి చూస్తే మా ఇంటి ముంగిట్లో ఉన్న రావి చెట్టు తాలుకు కొమ్మలు కిటికీ వరకు పరుచుకుని ఒకటీ అరా కొనలు మోపి లోపలికి తొంగి చూస్తున్నాయి.

తెల్లారిపోయినా ఆ చెట్టు మీద కొన్ని పిట్టలు ఇంకా కువకువలాడుతూనే ఉన్నాయి. సాయంత్రం వేళల్లో చూడాలి ఆ చెట్టును.


మరి సంజె వెలుగు కొమ్మల గుండా దూసుకొచ్చి ఎర్రెర్రని వెలుగులతో రావి చెట్టు మేలి ముసుగులో ఉన్న పెళ్ళి కూతురిలా మెరిసిపోతుంది.

ప్రతీ సాయంత్రం రావి చెట్టు పెళ్ళి పందిరంత సందడిగా ఉంటుంది.

వివిధ స్థాయిల్లో వినిపించే పక్షుల కలరవాలతో జంత్రగాత్ర సమ్మేళనంలా ఉంటుంది. వివిధ వాయిద్యాలు కలగలిపిన నిష్ణాతులైన కళాకారుల జుగల్ బందీలా ఉంటుంది.

సుతారంగా ఒంపు తిరిగిన రావి ఆకు కొసను కొనవేళ్ళతో పట్టుకుంది అమ్మ.

"గుర్తు లేదురా నీకు..." అమ్మ మరో మాట మాట్లాడబోయింది. కానీ ఏదో సన్నటి జీర అమ్మ



మాటను బయటకు రానీయలేదు.

అమ్మ చెప్పక్కరలేదు. నాకు తెలుసు. ఆ చెట్టును అమ్మ ఈ ఇంటికి కాపురానికి వచ్చిన వారం రోజులకి నాటింది. అంటే మాకంటే ముందు నుంచే అమ్మ దాన్ని పెంచుకుంటూ వచ్చింది.

నాకు బాగానే గుర్తు.

వేసవి వచ్చిందంటే మాకు, నాన్నగారికీ స్కూలు ఒక్క పూటే ఉండేది.

మండుటెండలో ఈ చెట్టుకిందే నించుని నాన్నగారు తెచ్చే మామిడిపళ్ళ బుట్టకోసం ఎదురుచూసే వాళ్ళం నేనూ, అన్నయ్యా. సాయంత్రమవగానే అమ్మ ఈ చెట్టు కిందే మంచాలు వేసి అన్నయ్యను, నన్ను చెరో వైపు పడుకోబెట్టుకుని రకరకాల కథలు చెప్పేది. ఆకుల మాటునుండి సగం కనిపిస్తున్న చందమామను చూస్తూ నిద్రలోకి జారుకోవడం అందమైన అనుభూతి.

నాన్నగారు రావడం ఆలస్యమయితే చాలు అమ్మ కిటికీ ముందుకు వచ్చేసేది. వీధి చివర్న నాన్నగారిని చూసేవరకు అమ్మ ప్రాణం కుదుటపడేది కాదు. 'నాన్నగారొచ్చేస్తున్నారోచ్' అంటూ ఏవో ఆటల్లో మునిగి ఉన్న మా ఇద్దర్నీ తీసికొచ్చి కిటికీ ముందు నించోబెట్టేది. ఓపక్కకి వంగి నడిచివచ్చే నాన్నగారి ప్రతిమను కళ్ళ నిండా నింపుకునేది. ఒళ్ళంతా కళ్లు చేసుకుని తన రాకకోసం కిటికీ దగ్గర వేచి చూస్తున్న మా ముగ్గుర్నీ చూడగానే నాన్న ముఖంలో అందాకా అలుముకున్న అలసట చటుక్కున మాయమయ్యేది.

రవంత తీరిక దొరికేక బయట ప్రపంచానికి అమ్మ వేసుకునే వంతెన ఈ కిటికీ. పవర్ కట్ పేరుతో పేరుకునే చీకటిని ఆ కిటికీ గుండానే వెన్నెల దీపం తరిమికొట్టేది.

తడిసి ముద్దయిన దేహానికి రెక్కలు విప్పుకున్న కిటికీ చిరుగాలి వింజామర వీచేది.

బహుశ ఈ కిటికీ ముందే కూర్చుని నాన్న అమ్మ కలసి మా ఇద్దరి భవిష్యత్తును గురించి సుందర స్వప్నాలను ఊహించుకుని ఉండచ్చు. నాన్నతోడుగా అమ్మ ఆ చెట్టుకిందే ఎన్నో ఆశల సౌధాలకు బలంగా పునాదులు వేసుకుని ఉండ వచ్చు.

ఆ కిటికీ ఫ్రేంలో అమ్మ ఎన్నెన్ని జ్ఞాపకాలను బంధించుకుందో!

కిటికీ చువ్వ పట్టుకున్న అమ్మ చేతిలో చిన్న కదలిక.

తలతిప్పి అమ్మ కళ్ళల్లోకి చూసేను.

అమ్మ కూడా చూసింది చల్లగా. మాటల కందని భావ మేదో నా మనసును తాకింది.

ఈ ఒక్క కిటికీని తీసేసి ఇన్ని జ్ఞాపకాలను సమాధి చెయ్యడమా?

మనసు చివుక్కుమంది. మరి అమ్మకెలా ఉంటుంది నిజమేకదా.

అమ్మకిప్పుడు నాన్నతో డుగా లేదు.

అమ్మకిప్పుడు ఆ జ్ఞాప కాలే తోడు. 'కన్నా.... ఈ కిటికీ మీ నాన్న ఆలోచనలు సజీవంగా చూపే జ్ఞాపకాలు కదురా' అనలేదమ్మ అయినా అర్థమయింది నాకు.

గుండెను కమ్ముకున్న దిగులు మేఘమేదో కరిగిపో యినట్టయింది.

గట్టిగా ఊపిరి పీల్చుకుని చిరునవ్వు నవ్వేను. ఆ చిరు నవ్వులో అమ్మకేం తోచిందో గాని చిన్నగా నా తల మీద మొట్టి వెనక్కి తిరిగి వెళ్ళి పోయింది. ఆ నడకలో ఏదో నమ్మకం.

ఆ తరువాత ఆ కిటికీ తన స్థానాన్ని మార్చుకోలేదు. తన ఉనికినీ కోల్పోలేదు. అంతేకాదు. తన రెక్కల్నీ ముడుచుకోలేదు. మా అబ్బాయి ఇరవైనాలుగ్గంటలూ ఆ కిటికీ పట్టుకు వేలాడుతుంటాడు.

ఇప్పుడు అమ్మలేదు.

కానీ అమ్మ చిరునవ్వు ఆ కిటికీలో ఇప్పటికీ సజీవంగానే ఉంది. ❑